క్లుప్తంగా

అనుమతి లేని టపాసుల దుకాణంపై పోలీసుల దాడి

మలక్‌పేట: సౌత్‌ఈస్ట్ టాస్క్ ఫోర్స్, మలక్‌పేట పోలీసులతో కలిసి పేలుడు పదార్థాల అక్రమ నిల్వపై దాడి చేసి వివిధ బ్రాండ్ల ఫైర్ క్రాకర్లను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ అడిషనల్ డిప్యూటీ కమిషనర్ అందె శ్రీనివాసరావు వివరాల ప్రకారం.. రామ్‌గుప్తా(38) మూసారంబాగ్ డివిజన్ శాలివాహననగర్‌లో సహస్ర ఫూట్‌వేర్ దుకాణంలో ఎలాంటి లైసెన్స్ లేకుండా పేలుడు పదార్థాలు(క్రాకర్స్) విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు సోమవారం పోలీసులు దుకాణంపై దాడిచేసి క్రాకర్లను స్వాధీనం చేసుకున్నారు.

సిరినగర్‌కాలనీలో వెలగని వీధి దీపాలు

నాగోలు: ఎల్‌బీనగర్‌లోని సిరినగర్‌కాలనీలో రెండు వారాలుగా వీధి దీపాలు వెలగకపోవడంతో అంధకారం నెలకొంది. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంధకారం నెలకొనడంతో రాకపోకలు సాగించే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నామని సంబంధిత అధికారులు స్పందించి వీధి దీపాలు వెలిగేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

దశలవారీగా సమస్యలు పరిష్కరిస్తా

వనస్థలిపురం: ప్రశాంత్‌నగర్ కాలనీని అన్ని విధాలుగా అభివృద్ధిచేసి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని ప్రశాంత్‌నగర్‌లో అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. సీనియర్ సిటిజన్స్ భవన నిర్మాణం, కనకదుర్గ దేవాలయం ముందు రోడ్డు విస్తరణ, ఎగువ కాలనీల నుంచి వచ్చే వరద నివారణ, కాలనీలో ఉన్న పార్క్ అభివృద్ధి, చెత్త డంపింగ్ తదితర సమస్యలను కార్పొరేటర్ దృష్టికి స్థానికులు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతు.. సమస్యలన్నీ దశలవారీగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం రాజగోపాల్, డీఈ రఫీ, ఏఈ శ్రీనివాస్, జీహెచ్ఎంసీ ఏఈ విఘ్నేశ్వరి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్, కాలనీ నాయకులు బాలాజీనాథ్, కరుణాకర్‌రెడ్డి, రామారావు, శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రశేఖర్ కుటుంబానికి అండగా ఉంటాం

ఎల్‌బీనగర్: అమెరికాలో దుండగుల కాల్పులలో మృతి చెందిన ఎల్‌బీనగర్ బీఎన్‌రెడ్డినగర్‌కు చెందిన విద్యార్థి పోలే చంద్రశేఖర్ కుటుంబాన్ని సోమవారం టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ పరామర్శించారు. ఈ సందర్భంగా మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ..ఉన్నత విద్యకోసం అమెరికా వెళ్లిన చంద్రశేఖర్ మృతి వారి కుటుంబ సభ్యులకు భరించలేని విషాదమని గన్ కల్చర్ అమెరికాలో రోజురోజుకు పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఘటన జరిగిన పెట్రోల్ బంక్ సీసీ కెమెరా రికార్డులను సేకరించి దర్యాప్తు పూర్తి చేయాలని అక్కడి అధికారులను కోరినట్లు తెలిపారు.చంద్రశేఖర్ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ భాషా అశోక్‌గౌడ్, నేలపాటి రామారావు, నాయకులు పార్వతి , గణేశ్‌రెడ్డి, వినయ్ పటేల్, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి , దేరింగుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సివరేజీ బోర్డు కార్మికులకు సన్మానం



సివరేజీ బోర్డు కార్మికులను సన్మానిస్తున్న సొసైటీ ప్రతినిధులు

మన్సూరాబాద్: నాగోలు డివిజన్ పరిధి రాక్‌టౌన్ రెసిడెంట్స్ వెల్ఫేర్ సొసైటీ కాలనీ సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి యోగా గురువు మధుసూధన్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గడిచిన కాలంలో వచ్చిన ఆదాయం , వ్యయాలపై చర్చించి, కాలనీ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో మూడు నెలలుగా విద్యార్థులకు ఉచితంగా పాఠాలు చెబుతున్న రిటైర్డ్ ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, సివరేజీ బోర్డు కార్మికులను సన్మానించారు. రాబోయే రెండు సంవత్సరాల కాలానికి బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకునేందుకు నిర్ణయించారు. ఐదుగురు సభ్యులతో కూడిన ఎన్నికల కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు ఎర్ర వినోద్‌రెడ్డి, మణిపాల్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, సూర్యనారాయణ, నాగరాజు, మాజీ అధ్యక్షులు పాల్గొన్నారు.



షాహీన్‌నగర్‌లో శ్రీశైలం ప్రధాన రహదారి దుస్థితి



కొత్తపేటలో మరమ్మతుకు నోచుకోని దారి

సమస్యలతో సహజీవనం

అధ్వాన రహదారులు
- అస్తవ్యస్తంగా డ్రైనేజీ
- ఇబ్బంది పడుతున్న పుర ప్రజలు
- నేతల ఓటు బ్యాంకు రాజకీయం
- పట్టించుకోని అధికార యంత్రాంగం



జల్‌పల్లి మున్సిపాలిటీ కార్యాలయం

పహాడీషరీఫ్: సమస్యలతో జల్‌పల్లి వాసులు సహజీవనం చేస్తున్నారు. సాధారణ ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపోటములను సైతం శాసించే మున్సిపాలిటీ.. అభివృద్ధిలో వెనుకబాటుకు గురైంది. పురపాలికను.. రాజకీయ పార్టీలు కేవలం ఓటు బ్యాంక్‌గానే భావించి, ఎన్నికల ఏరు దాటాక.. తెడ్డు తగలేస్తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రజా సమస్యలపై ఏ పక్షాలు దృష్టిసారించక, అధికార యంత్రాంగం పట్టించుకోక దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి.

మజ్లిస్‌తో బంధం

సాధారణ ఎన్నికల సమయంలో మున్సిపాలిటీ పేరు నియోజకవర్గంలో ప్రధానంగా వినిపిస్తుంటుంది. మహేశ్వరం నియోజకవర్గంలో ముస్లిం మైనార్టీ ఓటర్లు అధికంగా ఉండే ఈ పురపాలికలో.. వారి ఓట్లు ఏ పార్టీకి అధికంగా పడితే, ఆ అభ్యర్థి విజయం నల్లేరు మీద నడకగా మారుతుంది. 2023 నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడి నుంచి 37 వేల ఓట్లు పోలైతే, అందులో బీఆర్ఎస్ ఖాతాలో 23 వేలు పడ్డాయి. 8,702 ఓట్లతో కాంగ్రెస్ ద్వితీయ స్థానం, 4,706 ఓట్లతో బీజేపీ మూడో స్థానంతో సరిపెట్టుకుంది. మజ్లిస్ పార్టీ స్నేహబంధంతో మున్సిపాలిటీలో బీఆర్ఎస్ ఏకంగా 15 వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించగలిగింది. ఇదిలా ఉండగా.. ఇక్కడ అక్రమంగా నివాసం ఉంటున్న రోహింగ్యాలు, మదర్సాల అంశంపై ఓ పార్టీ.. మైనార్టీల సంక్షేమం తమతోనే సాధ్యమయిందంటూ మరో రెండు పార్టీలు చెప్పుకోవడం కొసమెరుపు.

నిధులు నిల్..

ఓ ప్రణాళిక లేకుండా భారీగా మురికి వాడలు కలిగిన పురపాలిక సంఘం సమస్యలకు నిలయంగా మారింది. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుద్దీపాలు, చెరువుల ముంపు, క్రీడా మైదానాలు తదితర సమస్యలు నెలకొన్నాయి. 2018- 2023 మధ్య కాలంలో డ్రైనేజీ పైప్‌లైన్లు, రహదారుల పనులు ఆశించిన స్థాయిలో జరిగాయి. కానీ గడిచిన రెండేళ్లుగా అభివృద్ధి పనుల ఊసే లేకుండా పోయింది. గత ప్రభుత్వ హయాంలోని చివరలో మంజూరు చేసిన రూ.25 కోట్ల నిధులు కూడా.. కొత్త సర్కార్ వచ్చాక రద్దయ్యాయి. ప్రస్తుతం మున్సిపాలిటీ సాధారణ నిధులతో కేవలం రోడ్లు, డ్రైనేజీ లాంటి మెయింటెనెన్స్ పనులు మాత్రమే చేయాల్సి వస్తోంది. ఇటీవల మున్సిపాలిటీని సందర్శించిన తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహా రెడ్డి ప్రత్యేక నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్ పరిధి రోషన్‌దౌలాలోని యూనివర్సల్ బాప్టిస్టు చర్చి నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ప్రకాశ్, ఉపాధ్యక్షుడి రంగయ్య, సెక్రటరీగా ఎస్.కృపాకర్, సుందర్‌రాజు, కోశాధికారిగా ఎం.దిలీప్, సండే స్కూలు డైరక్టర్‌గా జె.వెంకటేశ్, యూత్ డైరక్టర్‌గా జే.డానియల్‌ను ఎన్నుకున్నారు.

రైతు బజారులో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురంలోని రైతుబజారులలో కూరగాయల ధరలు టమాట రూ.20, వంకాయ 45, బెండ 35, పచ్చిమిర్చి 40, కాకర 32, బీర 38, క్యాబేజి 23, ఫ్రెంచి బీన్స్ 45, క్యారెట్ 55, దొండ 28–35, చిక్కుడు 70, గోకర 50, బీట్‌రూట్ 45, క్యాప్సికం 60, ఆలు 23, దోస 18, సొర 15, పొట్ల 18, ఉల్లిగడ్డ 20. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

చేవెళ్ల: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు దాతల సహకారాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణ రెడ్డి అన్నారు. మండలంలోని దేవునిఎర్రవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రామన్నగూడ నుంచి నడుచుకుంటూ వస్తున్న ఆరు మంది విద్యార్థులకు ఆయన సొంత నిధులతో సైకిళ్లు అందజేశాడు. సోమవారం పాఠశాల వద్ద ఉపాధ్యాయులు, గ్రామస్తులతో కలిసి వాటిని విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవునిఎర్రవల్లి ప్రభుత్వ పాఠశాలకు పక్కనే ఉన్న రామన్నగూడ వార్డు నుంచి ఆరు మంది విద్యార్థులు నడుచుకుంటూ వస్తున్నారని, రవాణా సౌకర్యం కల్పిస్తే బాగుంటుందని ఉపాధ్యాయులు గ్రామస్తుల దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు. విద్యార్థుల సమస్యను గుర్తించి తనవంతు బాధ్యతగా సైకిళ్లు అందించినట్లు స్పష్టం చేశారు. అనంతరం దాత సత్యనారాయణరెడ్డిని గ్రామ నాయకులు, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు దాత సహకారాన్ని ఎప్పటికీ మరిచిపోలేరన్నారు. కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్, సభ్యులు రాజిరెడ్డి, శ్రీనివాస్, మల్లారెడ్డి, రవీందర్, రాంరెడ్డి, సత్యనారాయణ, శివయ్య, జంగయ్యగౌడ్, గ్రామ యువకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శిబిరం చేపట్టి.. అవగాహన కల్పించి



సిరిగిరిపురంలో విద్యార్థుల క్యాంపు

- ప్రజలను చైతన్య పరుస్తున్న ఎన్ఎస్ఎస్
- ప్రజాసేవలో స్కీం వలంటీర్లు
- పచ్చదనం, పరిశుభ్రతపై ర్యాలీలు

మహేశ్వరం: విద్యార్థి దశ నుంచే చదువుతో పాటు సమాజ సేవ, క్రమ శిక్షణతో పాటు నాయకత్వ లక్షణాలు పెంపొందించేలా కార్యాచరణ చేపట్టేందుకు జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) ఎంతగానో దోహద పడుతుంది. అందులో భాగంగా ఏదైనా ఒక గ్రామంలో వారం రోజుల పాటు శిబిరం ఏర్పాటు చేస్తారు. అక్కడి ప్రజల స్థితిగతులను తెలుసుకుంటారు. అనంతరం వారిని చైతన్యపరిచేలా అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు, సదస్సులు,నాటికలు నిర్వహిస్తారు. పచ్చదనం , పరిశుభ్రత, మొక్కలు నాటి సంరక్షించడంతో కలిగే ప్రయోజనాల గురించి వివరించడమే స్కీం వలంటీర్ల లక్ష్యం. పది రోజులుగా మహేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో పాటు నగరానికి చెందిన ఇందిర ప్రియదర్శిని కళాశాల విద్యార్థులు మండల సిరిగిరిపురం, తుమ్మలూరు, మన్సాన్‌పల్లి, ఎన్డీతండా, డీజీ తండాలలో క్యాంపులు నిర్వహించి ప్రజలను చైతన్యపరిచారు.

నాటికల ద్వారా సందేశం

కార్యక్రమంలో భాగంగా ప్రజలకు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. విద్యా ప్రయోజనాలు వివరిస్తూ, బడీడు పిల్లలను బడికి పంపాలని తల్లిదండ్రులకు సూచిస్తున్నారు. స్వశక్తి సంఘాల మహిళలు సైతం అక్షర జ్ఞానం నేర్చుకునేందుకు అవకాశాలను వివరించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటి సంరక్షణ చేపట్టాలని సూచించారు. పచ్చదనం, పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా ఉంటామని చెబుతున్నారు. నశాముక్త్ భారత్ కార్యక్రమం ద్వారా యువత మత్తు బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి నాటికల ద్వారా సందేశం ఇచ్చారు. క్యాంపునకు డీసీపీ సునీతారెడ్డిని ఆహ్వానించి, సైబర్ నేరాలు, మత్తు పదార్థాలు తీసుకోవడం వలన కలిగే నష్టాల గురించి అవగాహన కల్పించారు.

చదువు విలువ తెలిపాం



సిరిగిరిపురంలో క్యాంపు నిర్వహించాం. నిరక్షరాస్యత వలన కలిగే నష్టాలను వివరించాము. అదే సమయంలో విద్య ప్రాముఖ్యతను ప్రజలకు తెలిపాం. ప్రభుత్వ పాఠశాలలు, ప్రాంగణాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాం. – మనీష, బీకాం ద్వితీయ సంవత్సరం

భవిష్యత్తుపై భరోసా



మత్తు పదార్థాలు(డ్రగ్స్, గంజాయి, అల్కాహాల్)కు దూరంగా ఉండాలని యువతకు అవగాహన కల్పించాం. వినియోగిస్తే కలిగే అనర్థాలు, ఆరోగ్య సమస్యలను వివరించాం. సమాజం ఎలా గుర్తిస్తో పేర్కొంటూ.. భవిష్యత్తుపై భరోసా కల్పించాం. – శైలజ, బీఏ, ఫైనల్

చైతన్యపరిచాం..



సిరిగిరిపురం శిబిరంలో.. విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు.. ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. తద్వారా విద్యారులు.. ప్రజలతో మాట్లాడడం, నాయకత్వ లక్షణాలపై లోతుగా తెలుసుకున్నారు. క్యాంపు ద్వారా చాలా నేర్చుకున్నారు. మరిన్ని క్యాంపులు నిర్వహిస్తాం.
– డా.జాహెదా బేగం, స్కీం ప్రోగ్రాం అధికారిణి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహేశ్వరం

సీజేఐపై దాడికి యత్నం అమానుషం

విశ్రాంత శాస్త్రవేత్త రాజేశ్వరరావు



మాట్లాడుతున్న రాజేశ్వరరావు

మీర్‌పేట: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడి అమానుషమని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని విశ్రాంత శాస్త్రవేత్త జి.రాజేశ్వరరావు అన్నారు. ఆదివారం రాత్రి మీర్‌పేట గాయత్రీనగర్‌లోని సమతా భవన్‌లో న్యాయవాదులు, డిప్యూటీ కలెక్టర్లు, ప్రొఫెసర్లు, అధ్యాపకులు, విద్యార్థులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి సీజేఐపై దాడిని ఖండించారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ.. దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు సీజేఐకే రక్షణ లేకపోతే సాధారణ పౌరుల పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. దేశంలో నిత్యం ఎక్కడో ఓ చోట బలహీన వర్గాలపై దాడులు జరుగుతూనే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తూ, దాడులను ఎదుర్కొనేందుకు దళిత బహుజన సంఘాలు, వామపక్ష ఉద్యమ సంఘాలన్నీ ఏకం కావాలని పిలుపునిచ్చారు. సీజేపై దాడిని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్త ఆందోళనలు నిర్వహించాలన్నారు. సమావేశంలో లోకాయుక్త స్టాండింగ్ కౌన్సిల్ జి.సత్యనారాయణయాదవ్, డా.వెంకటేశ్వర్లు, డా.సత్తయ్య, గావరాజు, న్యాయవాదులు విబూది వెంకటేశ్వర్లు, సామ్రాట్ వేణుగోపాల్, ఎంఎస్ లక్ష్మి, సురేష్, జూపూడి సురేందర్‌రావు, భిక్షమయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చూసి.. ఆకర్షితులై

- కాంగ్రెస్‌లో పెరుగుతున్న చేరికలు
- మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న కేఎల్లార్

కందుకూరు: ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఆకర్షితులై పెద్దఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరికలు పెరిగాయని మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని దాసర్లపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకులు జంబుల శివరాంరెడ్డితో పాటు పలువురు కేఎల్లార్ సమక్షంలో అధికార పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన.. వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం కేఎల్లార్ మాట్లాడారు. ఫ్యూచర్‌సిటీతో మహేశ్వరం నియోజకవర్గాన్ని మహానగరంగా అభివృద్ధి చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలు గెలిసి బహుమతిగా ఇద్దామన్నారు. భవిష్యత్ తరాలకు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రావాలంటే కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.కృష్ణనాయక్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఎస్.వెంకట్రామ్‌రెడ్డి, డైరెక్టర్లు కె.యుగంధర్‌గౌడ్, పాండురంగారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

మొయినాబాద్: విద్యార్థులు కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా సృజనాత్మకత, ఆవిష్కరణలు, సామాజిక బాధ్యత, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని డైనమిక్ టూల్స్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు జీఆర్ సూర్యరాజ్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరు రెవెన్యూలో ఉన్న అరిస్టాటిల్ పీజీ కళాశాలలో సోమవారం ఓరియంటేషన్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఎంబీఏ కోర్సు సమయంలో అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉన్నత విద్యలో క్రమశిక్షణ, నిబద్ధత, కష్టపడి పనిచేయడం విజయానికి కీలకమైన సూత్రాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆటాపాటలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆర్.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎల్.శ్రీనివాస్‌రెడ్డి, కేజీరెడ్డి కళాశాల ప్రిన్సిపాల్ సాయి సత్యనారాయణరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వరద తగ్గి.. మురుగు నిలిచి

మీర్‌పేట: మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధి మిథులానగర్‌లోని వీధులు బురదతో కంపు కొడుతున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఈ కాలనీ పూర్తిగా ముంపునకు గురైన విషయం తెలిసిందే. ప్రస్తుతం వరద తగ్గుముఖం పట్టినప్పటికీ వీధుల్లోని మురుగు మాత్రం అలాగే ఉండిపోవడంతో కాలనీవాసులు ఇళ్లలో నుంచి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. మున్సిపాలిటీ వారు బురదను తొలగించకపోవడంతో దుర్వాసనతో అవస్థలు పడుతున్నామని, కొందరు యజమానులు ఇళ్లకు తాళాలు వేసి వెళ్లిపోయారని స్థానికులు తెలిపారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్న దృష్ట్యా కార్పొరేషన్ యంత్రాంగం స్పందించి వెంటనే వీధుల్లోని బురదను తొలగించి బ్లీచింగ్ చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.



మిథులానగర్ చర్చి వీధిలో నిలిచిన బురద



మిథులానగర్‌లోని ఓ వీధి దుస్థితి